క్లుప్తంగా

అంబేడ్కర్‌పై దిగజారుడు వ్యాఖ్యలు మానుకో

పవన్ కల్యాణ్‌పై బొంతా మండిపాటు

కొవ్వూరు: గాంధీజీ సిఫార్సుతోనే అంబేడ్కర్ పదవి వచ్చిందంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిగజారుడు వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలని మాల మహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొంతా శ్యాంరవి ప్రకాష్ మండిపడ్డారు. రెండు లక్షల పుస్తకాలు చదివానని చెప్పే పవన్ కల్యాణ్ గాంధీజీకి అంబేడ్కర్‌కి మధ్య జరిగిన పోరాటం తెలియకపోవడం బాధకరం అన్నారు. ప్రత్యేక నియోజక వర్గాలు కోసం అంబేడ్కర్ కోరుకున్న తరుణంలో గాంధీజీ యర్రాడ జైలులో నిరాహార దీక్ష చేసి షెడ్యూలు కులాల హక్కులు హరించారని ఆరోపించారు. తన జాతికి జరిగిన అన్యాయంపై జీవితాంతం వేదన అనుభవించారాని పేర్కొన్నారు. అంబేడ్కర్ వంటి మహనీయులు గురించి మాట్లాడేటప్పుడు పవన్ పూర్తిగా తెలుసుకుని మాట్లాడితే మంచిందని హితవు పలికారు. లేదంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు విద్యార్థి ఎంపిక



మహిని అభినందిస్తున్న హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు

కొవ్వూరు: రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్–14 విభాగం జట్టుకి ఐ.పంగిడి ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి కొడమంచిలి మహి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మంగిన రామారావు తెలిపారు. ఇటీవల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరుపున పెదతాడేపల్లిలో గత నెల 29న నిర్వహించిన సెలక్షన్స్‌లో మహి ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం పాఠశాలలో రాష్ట్ర జట్టుకి ఎంపికైన మహిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఆమెకు శిక్షణ అందించిన పీఈటీ పీఎస్‌వీ రవికుమార్‌ను అభినందించారు.

గుండె వైద్య శిబిరంలో 55 మందికి పరీక్షలు



కాకరపర్రులో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

పెరవలి: కాకరపర్రులో మంగళవారం విజయవాడకు చెందిన ఉషా కార్డియాక్ హాస్పటల్‌కు చెందిన వైద్యబృందం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మందిని పరీక్షించగా వీరిలో 14 మందిలో గుండెకు సంబంధించిన లోపాలను గుర్తించి వారికి ఆరోగ్య శ్రీలో వైద్యం చేయడానికి రిఫర్ చేసినట్టు పీఆర్వో అశోక్ తెలిపారు. వీరందరికి వైద్యానికి అయ్యే ఖర్చు అంతా ఉచితంగా ఆరోగ్య శ్రీలోనే చేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, శ్రీనివాస్ సౌజన్యంతో ఏర్పాటు చేశారని వివరించారు.

వరసిద్ధి వినాయకునికి వెండి కిరీటం



దాతకృష్ణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నల్లజర్ల: స్థానిక సెంటర్‌లోని వరసిద్ధి వినాయకుడి ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వినాయక హోటల్ యజమాని నాతిరెడ్డి కృష్ణ 1.250 కిలోల వెండితో(రూ.10 వేలు విలువ)కిరీటం చేయించి స్వామి వారికి సమర్పించారు. దాత నాతిరెడ్డి కృష్ణను ఆలయ కమిటీ చైర్మన్ ఇనగళ్ళ శ్రీను, కమిటీ సభ్యులు మద్దిపాటి గంగాధర్, గంటానాగేశ్వరావు, కరుటూరి ప్రసాద్, కండెపు రాంబాబు, సవలం రామకృష్ణ శాలువాతో సత్కరించారు.

వైభవంగా గంగాలమ్మ జాతర



ప్రక్కిలంకలో గంగాలమ్మ గ్రామోత్సవం

తాళ్లపూడి: ప్రక్కిలంకలో మంగళవారం గంగాలమ్మ జాతర వైభవంగా జరిగింది. గోదావరిపై ఆధారపడి జీవనం సాగించే స్థానిక బూరి లంక వడ్డీలు ఏటా గంగాలమ్మకు మొక్కులు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. చేప ఆకారంలో వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా తయారు చేసి ప్రక్కిలంక, తాళ్లపూడి గ్రామాల్లో వీధుల గుండా గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ వేషధారణలు, సాంస్కృత కార్యక్రమాలతో ఉత్సాహంగా సాగింది. ఇది తమ పూర్వికుల నుంచి వస్తున్న ఆచారమని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజా ఆరోగ్యానికి సురక్ష

- రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత
- నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం



కాపవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత



సంగాయగూడెం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు



రావూరుపాడులో మందులను పరిశీలిస్తున్న మంత్రి వనిత



కాపవరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



గోపవరంలో లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కొవ్వూరు: ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ఉచితంగా ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. కాపవరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు గ్రామాల్లో ప్రతి సచివాలయం పరిధిలో ఈ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ముందుగా ఆరోగ్య పరమైన సమస్యలు గుర్తించి చికిత్స అందించే నూతన అధ్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్య తనిస్తుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వం పేదవాడి వైద్యంపై ఇంత శ్రద్ధ చూపలేదన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన పరీక్షలు చేసి రోగ నిర్ధారణ పరీక్షలు చేయడమే కాకుండా వారికి ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా సేవలు, మందులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, సర్పంచ్ సుంకర పద్మిని, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, డీఎల్‌డీవో శాంతమణి, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, డాక్టర్ బి.శ్రీనివాస్, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, కాకర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావూరుపాడులో

తాళ్లపూడి: పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మైఖెల్ ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను మంత్రి సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల కన్వీనర్ కాకర్ల వెంటేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ప్రజల ఆరోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని దేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు అన్నారు. సంగాయగూడెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సర్పంచ్ కరుటూరి ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు పాల్గొని మాట్లాడారు. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, 172 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. సంగాయగూడెం శిబిరంలో 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. 23 మంది రోగులకు రిఫర్ చేసినట్టు ఆయన చెప్పారు. శిబిరం వద్ద గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు. యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నాగదేవి, డాక్టర్ సీహెచ్ హరిచందన్, ఆర్థో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ రవి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుంకవల్లి చినవెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ రాధాకృష్ణ, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, ఆచంట సురేష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు ఎస్‌కే అస్మత్ ఉన్నీషా, గ్రామ సచివాలయ కార్యదర్శి ఆమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: గోపవరం ఎంపీయూపీ స్కూలు ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు ప్రారంభించారు. ప్రజలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీ, తోలేటి శ్రీనివాస్, తాతపూడి నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఈఓపీఆర్డీ రత్నమాలిక తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో..

పెరవలి: కాపవరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పరిశీలించారు. ఈ వైద్య శిబిరంలో 303 మందికి పరీక్షలు నిర్వహించగా మరిన్ని పరీక్షలు, ఆరోగ్యశ్రీ పథకంలో 30 మందిని రిఫర్ చేశామని స్థానిక వైద్యురాలు యం.కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంటుమిల్లు రత్నాజీరావు, మెర్ల భవానీ, వైఎస్సార్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శిబిరాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్యే తలారి



భీమోలులో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలారి

నల్లజర్ల: పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనంతపల్లి గ్రామ సచివాలయం –1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. శిబిరాన్ని సర్పంచ్ వెంగళ కమలకుమారి ప్రారంభించారు. సాయంత్రం ఎమ్మెల్యే తలారివెంకట్రావు సందర్శించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో 558 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 20మందికి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. తహసీల్దారు కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖర్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, బంక అప్పారావు, బళ్ళ నాని, ఆరెళ్ళ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాలు నిరుపేదలకు వరం లాంటివని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. భీమోలులో మంగళవారం జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండలపార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవిత హుకుంపేట, గోపాలపురం పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నిడదవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష

నిడదవోలు: పట్టణంలో కాపు కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచిసాయంత్రం 5 గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. ఒకటి నుంచి ఆరు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఐదుగురు ప్రత్యేక వైద్య నిపుణులు, ఇద్దరు జనరల్ వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారు.

చదరంగం పోటీల్లో శశి విద్యార్థుల ప్రతిభ



వేలివెన్నులో విజేతలతో అధ్యాపక బృందం

ఉండ్రాజవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–8, అండర్–10, అండర్–12, అండర్–14, అండర్–16 బాలబాలికల చదరంగ పోటిలు శశి వేలివెన్నులో మంగళవారం నిర్వహించారు. ఈపోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

అండర్–16 బాలికల విభాగంలో ఎం.వర్షిత మొదటి స్థానం, అండర్–8 బాలికల విభాగంలో ఎం.రిషిత మొదటి స్థానం, టి.రసజ్ఞ ద్వితీయ స్థానం, ఎ.నాగ సాత్విక తృతీయ స్థానం, అండర్–8 బాలుర విభాగంలో ఎ.ప్రవికాంత్ మొదటి స్థానం సాధించారు. అండర్–10 బాలికల విభాగంలో ఎం.దిధీప్య మొదటి స్థానం, వి.దుహసిని ద్వితీయ స్థానం, మి.శాన్వి మోహన్ తృతీయ స్థానం, అండర్–10 బాలుర విభాగంలో బి.శివరాం మొదటి స్థానం, పి.మణితేజ ద్వితీయ స్థానం, బి.నరశింహ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. అండర్–12 బాలికల విభాగంలో ఎం.లక్ష్మిప్రసన్న మొదటి స్థానం, సి.భవిష్యశ్రీ ద్వితీయ స్థానం, వి.రేష్మశ్రీ తృతీయ స్థానం, అండర్–12 బాలుర విభాగంలో ఎ.షారు మొదటి స్థానం, సాయి స్వరాజ్ ద్వితీయ స్థానం, పి.శశిధర్ తృతీయ స్థానం సాధించారు. అండర్– 14 బాలికల విభాగంలో ఎ.ఎస్.మేఘన మొదటి స్థానం, బి.భవ్యశ్రీ ద్వితీయ స్థానం, వై.కృతిక తృతీయ స్థానం, అండర్–14 బాలుర విభాగంలో పి.సాత్విక్ మొదటి స్థానం, ఏ.వైభవ్ ద్వితీయ స్థానం, బి.ప్రదీప తృతీయ స్థానం, అండర్–16 బాలికల విభాగంలో ఎ.ఎస్.పూజిత మొదటి స్థానం, ఆర్.రేణుక శ్రీలక్ష్మి ద్వితీయ స్థానం, వి.రామ సత్యసాయిశ్రీ తృతీయస్థానం, అండర్–16 బాలుర విభాగంలో కె.రాంప్రసాద్ మొదటి స్థానం, కె.నాగ సంతోష్ ద్వితీయ స్థానం, ఏ.జై ఆదిత్యశ్రీ సాయి తృతీయ స్థానం, సాధించారని తెలిపారు. ఈపోటీల్లో విజేతలు ఈనెల 28, 29 తేదీల్లో భీమవరంలో జరగనున్న ఇంటర్నేషనల్ ల్పెస్రేటింగ్ టోర్నమెంట్, డిసెంబర్ 3న భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థయీయి 7వ చెస్ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారని రవికుమార్ తెలిపారు. విద్యార్థులను రవికుమార్, శశి వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

సమగ్ర రీసర్వే డ్రాఫ్ట్ ఆర్వోఆర్ ప్రచురణ

దేవరపల్లి: గౌరీపట్నం శివారు కొండగూడెంలో భూముల రీసర్వే పూర్తయినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం డ్రాఫ్ట్ ఆర్వోఆర్‌ను ఆయన ప్రచురించారు. ఈ సందర్భంగా రైతులకు డ్రాఫ్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడారు. గ్రామంలో 400 మంది రైతులకు చెందిన 825 ఎకరాల భూములనే రీసర్వే చేసి డ్రాఫ్ట్ ఆర్వోఆర్ తయారు చేసినట్టు ఆయన తెలిపారు. దీనిపై ఎటువంటి అనుమానాలు ఉన్నా అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. డ్రాఫ్ట్ ఆర్వోఆర్‌ను ఆయన ప్రచురణ చేశారు. ఈ సదస్సులో సర్పంచ్ రాయి అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుతరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశు, వైఎస్సార్ సీపీ నాయకులు కొర్లపాటి సుబ్రహమణ్యం, రైతులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు



సంగాయగూడెంలో జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

- జగనన్న లేఅవుట్‌లో మౌలిక వసతులు
- నీరు, రోడ్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు

దేవరపల్లి: జగనన్న లేఅవుట్లలో గృహనిర్మాణాలు చేపట్టడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. దేవరపల్లి మండలంలో 2944 గృహాలు మంజూరు కాగా లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఉచితంగా అందిస్తుండగా, డ్వాక్రా సంఘాలకు బ్యాంకు ద్వారా రూ.35 వేలు చొప్పున మంజూరు చేస్తోంది. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో గృహనిర్మాణాలు జరుగుతున్నాయి. సంగాయగూడెం గ్రామంలో 60 గృహాల నిర్మాణం జరుగుతుంది. గృహనిర్మాణం శరవేగంగా జరుగుతుండడంతో నీరు, రోడ్లు ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో రోడ్లు, మంచినీటి పైపులైన్ల నిర్మాణం చేస్తున్నారు. మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి ఎంపీపీ కేవీకే దుర్గారావు రూ.7.50 లక్షలు మంజూరు చేశారు. రూ.5 లక్షల అంచనా వ్యయంతో గ్రావెల్ రోడ్లు, రూ.2.50 లక్షల వ్యయంతో మంచినీటి పైపులైన్ నిర్మిస్తున్నారు. లబ్ధిదారులే సొంతంగా గృహనిర్మాణాలు చేసుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు రూరల్: వార్షిక మరమ్మతుల నిర్వహణ కారణంగా కోరుమామిడి, తాడిమళ్ల సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు మంగళవారం తెలిపారు. కోరుమామిడి, తాడిమళ్ల, ఆమ్మెపల్లి పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు త్రీఫేజ్ విద్యుత్‌ను ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా చేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల విత్తనాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యాన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇమ్మానియేలు

నల్లజర్ల: ఎస్సీ సబ్ ప్లాన్‌లో పుల్లలపాడు గ్రామ ఎస్సీ, బీసీ రైతులకు కూరగాయల విత్తనాలు, నారును వెంకట్రామన్నగూడెం ఉద్యానయూనివర్సిటీ ప్రొఫెసర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగులో చీడపీడల నివారణ, పురుగుమందుల వినియోగం తగ్గించడం, సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఎస్సీ రైతుల జీవనోపాధి పెంచడానికి ఇదోక అసాధారణ మార్గమన్నారు. మెరుగైన కూరగాయల సాగుకు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, కారెం రాంబాబు, అల్లూరి చిన భాస్కరావు, మండల ఉద్యానశాఖ అధికారి బబిత పాల్గొన్నారు.

జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

- మంత్రి తానేటి వనిత
- దేచెర్లలో గడప గడపకూ మన ప్రభుత్వం



దేచెర్లలో పథకాలు వివరిస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఐ.పంగిడి పంచాయతీ పరిధిలోని దేచెర్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వత ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకి సాగారు.పేదలందరికీ మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వించాలని కోరారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, స్థానిక సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల వానీ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పోసిన శ్రీకృష్ణదేవ రాయులు, కంచుమర్తి బాల శంకరం పంతులు, నూకతట్టి భూపతి, పల్లి రత్నకాంత్, మురుదుండి వెంకటేష్, బోడా బ్రహ్మయ్య, పెదపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు విస్తరణ పనులకు నేడు శంకుస్థాపన



ఖండవల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెరవలి: రవళి స్పిన్నింగ్ మిల్లులో 150 కోట్లతో విస్తరణ పనులకు బుధవారం ఉదయం 10 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లి రవళి స్పిన్నింగ్ మిల్లులో మంగళవారం వర్చువల్ విధానానికి కావలసిన ఏర్పాట్లను దగ్గర ఉండి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవళి స్పిన్నింగ్ మిల్లులో రూ.150 కోట్లలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ రోటరీ స్పిన్నింగ్ వీరింగ్ కంపెనీకి ఏర్పాటు చేసిన పనులను పరిశీలించినట్టు తెలిపారు. ఈ పరిశ్రమ విస్తరణ వలన వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు. వైఎస్సార్ పార్టీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ నూతన పరిశ్రమ ద్వారా ఉత్పత్తి అయ్యే దారం నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, మలేషియా వంటి దేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. రవళి స్పిన్నింగ్ మిల్లు డైరెక్టర్ వంక రఘువీర్, ఆర్డీఓ మల్లిబాబుతో ఈ వర్చువల్ సమావేశానికి తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.రాజ రాజేశ్వరి, ఎంపీడీఓ దామోధరరావు, రవళి స్పిన్నింగ్ పార్టనర్లుబి.రాజశేఖర్, గంధం వీరరాఘవు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై నిరసన



చాగల్లులో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

చాగల్లు: కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు మేరకు రైతు సంఘాలు బ్లాక్ డే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కేంద్రానికి వ్యతిరేకంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు, రైతు సంఘం నాయకులు కంకటాల బుద్ధుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను ప్రవేశపెట్టిందని రైతులందరూ దేశవ్యాప్తంగా ఉద్యమించడంతో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. ఇప్పటికీ రైతాంగం కోరుతున్న న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిక పోవడం దుర్మార్గమన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధరలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ రంగంలోని మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని కోరారు. దేశంలోని రైతుల వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొడవటి వెంకటరాయుడు, కొఠారు నాగేశ్వరరావు, కొడవటి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు .

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మెటర్నల్ హెల్త్ అండ్ చైల్డ్ కేర్ అనే అంశంపై అవగాహన కల్పించారు. జి.సత్యనారాయణ ఆర్థిక సహకారంతో 68 మంది బాలింతలు, గర్భిణులు, రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, చేబోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ప్రజలకు ఉపశమనం

ఉండ్రాజవరం: మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో మండల ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వేసవిని తలపించేలా ఉన్న ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో మండలంలోని ప్రజలు ఊపిరి తీసుకున్నారు. ఈ వర్షం పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.